క్లుప్తంగా

ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర



వేలేరు : మండలంలోని షోడాషపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయం, విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. సాయంత్రం గణపతిపూజతో మొదలైన వేడుకలు బుధవారం మూర్తి కుంభస్థాపన, చతుస్థానార్చన, అగ్నిప్రతిష్ట, క్షీరాధివాసం, దేవతామూర్తిహవనం, పూర్ణాహుతి అనంతరం లక్ష్మి, భూలక్ష్మీనాభిశిలా విగ్రహ పునఃప్రతిష్ఠాపన, సాయంత్రం చతుస్థానార్చన, దేవతామూర్తి హోమం, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మామిడాల మణేమ్మ–బుచ్చిరెడ్డి, మామిడాల మహేందర్‌రెడ్డి–రాధిక దంపతులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన కుందేల అక్షిత ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో బీఎస్సీ నర్సింగ్ సీటు సాధించింది. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ వల్లపురెడ్డి రాంరెడ్డి విద్యార్థిని అక్షితను అభినందించి ప్రోత్సాహకంగా రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మడికంటి రాజయ్య, మాజీ ఉపసర్పంచ్ కుమారస్వామి, వెంకన్న, రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

కమలాపూర్ : మండలంలోని నేరెళ్ల–అంబాల గ్రామాల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన సాయిని రాజు తన భార్య సరస్వతితో కలిసి ఈనెల 20న నేరెళ్లలో జరిగిన గృహ ప్రవేశానికి హాజరై ద్విచక్రవాహనంపై హసన్‌పర్తికి వెళ్తున్నాడు. నేరెళ్ల–అంబాల మధ్యలో ఉన్న కోళ్ల ఫారం వద్ద పొలాల బాట నుంచి రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చిన నాయకం రాజు తన ద్విచక్రవాహనంతో వీరిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సాయిని రాజు ద్విచక్ర వాహనం పైనుంచి ఎగిరి పడగా.. వెనకాల కూర్చున్న సరస్వతికి తీవ్ర గాయాలయ్యాయి. సాయిని రాజు ఫిర్యాదు మేరకు నాయకం రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు

వేలేరు : తాటిచెట్టుపై నుంచి జారిపడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మల్లికుదుర్లలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సట్ల మల్లయ్య వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు 108 లో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



శాయంపేట : మండలంలోని తహరాపూర్‌లో శివాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం రెండోరోజు వైభవంగా కొనసాగాయి. వేదపండితులు, రుత్వికులు కాసుల చంద్రశేఖరశాస్త్రీ, గోపికృష్ణశర్మ, కొండే నారాయణ, దత్తుశర్మ, నాగరాజుశర్మ, రాఘవేంద్రశర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ నిత్య పూజ, కలశస్నాపనం, మహాభిషేకం, ధ్వజస్తంభంపై నీళ్లతో అభిషేకాలు, సామూహిక హోమాలు నిర్వహించారు. అనంతరం ధాన్యాదివాసం, శయ్యాదివాసం, తత్వన్యాసం కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పున్నం పురుషోత్తంరెడ్డి, నాయకులు రాజేందర్, మహేందర్, భిక్షపతి, ప్రతాపరెడ్డి, రవీందర్, ఆదిరెడ్డి, సదానందం, రమేశ్, రామ్‌రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

గ్రామకమిటీల ఎన్నిక



వేలేరు : మండలంలోని కన్నారం, మల్లికుదుర్ల గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ తెలిపారు. కన్నారం గ్రామ శాఖ అధ్యక్షుడిగా డప్పు శ్రీను, ఉపాధ్యక్షులుగా ఇరుగు చంద్రమౌళి, ప్రధానకార్యదర్శిగా జన్నే ప్రవీణ్, కార్యదర్శిగా వేల్పుల రాజయ్య, అధికార ప్రతినిధిగా ఇరుగు సదానందం, మల్లికుదుర్ల గ్రామశాఖ అధ్యక్షుడిగా బట్టు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బట్టు రాములు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య, కార్యదర్శిగా యాదగిరి, అధికార ప్రతినిధిగా వెంకటస్వామిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు రాజయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరిలో సమస్యల తిష్ట

- కానరాని డ్రెయినేజీ
- ముళ్లపొదల్లో వైకుంఠధామం
- శిథిలావస్థలో అంగన్‌వాడీ సెంటర్

ఆత్మకూరు : మండలంలోని తిరుమలగిరిలో సమస్యలు తిష్టవేశాయి. మండల కేంద్రానికి అతి దగ్గరలో ఉన్న ఈ గ్రామంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో సైడ్‌డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామంలో సైడ్‌డ్రెయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే గత ప్రభుత్వం నిర్మించిన వైకుంఠదామంలో చెట్లపొదలు కమ్ముకుపోయాయి. గ్రామాభివృద్ధిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం అలంకారప్రాయంగా మారింది. అలాగే గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో నిరుపయోగంగా మారింది. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలోనే అంగన్‌వాడీ సెంటర్ కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తుండగా కేవలం 8 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరు అవుతున్నారు. కాగా గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ముళ్ల చెట్లు, చెత్తాచెదారంలో వైకుంఠధామం



అలంకారప్రాయంగా క్రీడాప్రాంగణం



శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ సెంటర్



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మాలల సింహగర్జనకు తరలిరావాలి

ఆత్మకూరు : డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ మాల సింహగర్జనను విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి తుప్పని నరసింహస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం సింహగర్జన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాల సింహగర్జనకు మాలలు వేలాదిగా తరలిరావాలన్నారు. దళితులందరూ కలిసి ఉంటేనే దళిత జాతి అభివృద్ధి జరుగుతుందని అన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ పేరుతో విడగొట్టాలని చూస్తే దళిత జాతి నష్టపోతుందన్నారు. దళితులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు రాజమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ రవీందర్, అశోక్, వేణు, రవికుమార్, ప్రభాకర్, సారయ్య పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

త్రిశూల్ దీక్షను జయప్రదం చేయాలి

పరకాల : డిసెంబర్ 11న నిర్వహించతలపెట్టిన త్రిశూల్ దీక్షను జయప్రదం చేయాలని తెలంగాణ భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు కోరారు. మంగళవారం ఆయన పట్టణంలో పర్యటించి మాట్లాడారు. ధర్మ రక్షణలో ముందుడాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ దీక్షకు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ వరంగల్ మహానగర సహకార కార్యదర్శి గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, బజరంగ్ దళ్ వరంగల్ మహానగర సహకార కార్యదర్శి గంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా జరిగింది. పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఐనవోలులో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో పాటు వివిధ పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కమలాపూర్ ఎంజేపీ పాఠశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించగా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. - సాక్షి నెట్‌వర్క్



వేలేరు : పనులకు భూమిపూజ చేస్తున్న ఆర్డీఓ



ఎల్కతుర్తి : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



శాయంపేట : గురుకుల పాఠశాలలో ..



ధర్మసాగర్ : కూలీని సన్మానిస్తున్న డీఆర్డీఓ



ధర్మసాగర్‌లో..



ఆత్మకూరులో..



దామెర : ప్రతిజ్ఞ చేస్తున్న డీవైఎఫ్ నాయకులు



నడికూడ : ర్యాలీ నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులు



ధర్మసాగర్ లో..



పరకాల : అధ్యాపకులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



కమలాపూర్ : మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి
- పెద్దకోడెపాక, జోగంపల్లిలో కొనుగోలు కేంద్రాల తనిఖీ

శాయంపేట: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని పెద్దకోడెపాక, జోగంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులతో మాట్లాడారు. రైతులకు టోకెన్లు ఎలా జారీ చేస్తున్నారని వ్యవసాయ విస్తరణ అధికారి అన్వేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 శాతంలోపు తేమ ఉన్న ధాన్యం రైతులకు మాత్రమే టోకెన్లు జారీ చేయాలని సూచించారు. లారీల కొరత ఏర్పడినా, రవాణా చేసే వారు సహకరించకపోయినా తనకు సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లుకు పంపించగానే ఓపీ ఎమ్మెస్‌లో రైతుల పేర్లు ఎంటర్ చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌ఐ, ఏఈఓలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



పెద్దకోడెపాకలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

మార్చి నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలి

ఎంపీడీఓ బాబు



కమలాపూర్ : ఉపాధి హామీ పనుల జాతరలో భాగంగా ప్రారంభించిన పనులన్నింటినీ 2025 మార్చి నెలాఖరులోగా పూర్తిచేసి బిల్లులు సకాలంలో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ గుండె బాబు ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని శ్రీరాములపల్లిలో మంగళవారం ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములపల్లిలో నర్సరీని, అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రత్యేకమైన పనిని ప్రారంభించారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎమ్మెల్యేరేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : విద్యార్థులు చదువులో ముందుండి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా హై స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన హాజరైన మాట్లాడారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఉపాధ్యాయకులు జ్ఞాపిక అందించారు. ప్రొవిజనల్ మదర్ యానిస్, సిస్టర్ జాయిస్, ఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని లింగమడుగుపల్లిలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు.



ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

యువత వ్యసనాలకు బానిసకావొద్దు

- మామునూరు ఏసీపీ తిరుపతి

ఐనవోలు : యువత వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని మామునూరు ఏసీపీ తిరుపతి సూచించారు. మండల పరిధిలోని 44వ డివిజన్ సింగారం గ్రామంలో మంగళవారం రాత్రి మామునూరు ఏసీపీ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్సైలతో పాటు సుమారు 40 మంది పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పత్రాలు లేని 24 బైకులు, 1 ఆటోను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. అదే విధంగా రూ.10 వేల విలువచేసే మద్యం, రూ.5వేల విలువచేసే పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం సెంటర్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత గంజాయి, తంబాకు లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాను అవసరానికి మించి వినియోగించొద్దని అన్నారు. కిరాణా, పాన్‌షాపుల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించొద్దని అన్నారు. ఇన్‌స్పెక్టర్లు రాజగోపాల్, రమేశ్, మహేందర్, ఎస్సైలు శ్రీనివాస్, కృష్ణవేణి, శ్రీకాంత్, కుమార్, రాజు, ఏఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఐనవోలు : స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఏసీపీ తిరుపతి

ధర్మసాగర్ : సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై జానీపాషా సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో గల చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భద్రత, డయల్ 100పై అవగాహన కల్పించడంతో పాటు గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఇంటర్‌నెట్ వినియోగాన్ని అవసరానికి మించి వాడొద్దన్నారు. సిబ్బంది సలీం, వెంకటేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సరిత

ఐనవోలు : విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పున్నేలు సబ్‌సెంటర్ డాక్టర్ సరిత అన్నారు. మండలంలోని సింగారం ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. 86 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన పోషక పదార్థాల గురించి వివరించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సలహాలు, సూచనలు చేశారు. హెచ్‌ఎంలు మధుసూదన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఫాతిమా మేరి, రామకృష్ణారెడ్డి, ప్రశాంత్, మమత, మంజులాల్, శ్రీరామ చంద్రమూర్తి, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీకాంత్, ఏఎన్‌ఎం ప్రసన్న, ఆశాలు పద్మ, శ్రీలత పాల్గొన్నారు.

ఓటరు సవరణకు దరఖాస్తు చేసుకోవాలి

- ఎంపీడీఓ ఫణిచంద్ర

శాయంపేట : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తయారు చేసిన ఓటరు జాబితాలో అవకతవకలు జరిగినట్లయితే ఈనెల 30వ తేదీలోగా లిఖితపూర్వకంగా దరఖాస్తు సమర్పించాలని ఎంపీడీఓ ఫణిచంద్ర సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఓటరు జాబితాపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. జనవరి 01–2025 వరకు 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఓటర్ల తుది జాబితా పంచాయతీ కార్యదర్శుల వద్ద ఉంటుందని, ఓటర్ల నమోదులో వార్డులు మారినట్లైతే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే మళ్లీ మార్పు చేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ రంజిత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, సీపీఐ నాయకులు సాంబయ్య, నాయకులు రవి, శంకరాచారి, కట్టయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణిచంద్ర

ఉపాధి హామీ నిధులను వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం కక్కిరాలపల్లి గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల జాతరలో ఆయన పాల్గొని ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.5లక్షలతో కట్టుకాలువ మరమ్మత్తు (ఫీడర్ కెనాల్) పనులను, పశువుల దానాకు ఉపయోగపడే అజోల్లా తయారీకి వినియోగించేందుకు రూ.18 వేల విలువ చేసే పిట్‌లకు భూమిపూజ చేశారు. ఇందిరా మహిళ శక్తి ద్వారా ఉపాధి నిధులు రూ.92,705 అంచనా వ్యయంతో రైతు పడిదల రమ నిర్మించుకున్న పశువుల పాకను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈజీఎస్ నిధులను అధికారులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమయ్యే పనిముట్లు, ఇతర సదుపాయాలు కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



నడికూడ : పాల్లీఫామ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

నడికూడలో..

నడికూడ : ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం గొల్లపల్లికి చెందిన జీల శ్రీనివాస్ భూమిలో ఈజీఎస్ నిధులతో మంజూరైన పౌల్ట్రీ ఫామ్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకుంటూ రైతులు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, రైతులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

నడికూడ : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.